తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-07- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 220 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# హిల్ట్ పాలసీపై ఏ విచారణకైనా సిద్ధం



- భూ వినియోగ మార్పిడిపై విచారణకు ప్రభుత్వం సిద్ధం
- హిల్ట్ పీ ద్వారా రూ.10,776 కోట్ల ఆదాయం: భట్టి
- గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.4,076 కోట్ల నష్టం
- హిల్ట్ పాలసీ పారదర్శకం, దోపిడీకి ఆస్కారం లేదు
- పారిశ్రామిక భూముల మార్పిడిలో బీఆర్ఎస్ అక్రమాలు
- తెలంగాణ రైజింగ్–2047తో 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- హిల్ట్ పీ మార్గదర్శకాలు త్వరలో విడుదల: శ్రీధర్‌బాబు
- పూర్తి పారదర్శకతతో భూ బదలాయింపు విధానం: ఉత్తమ్
- హిల్ట్ పాలసీలో చీకటి కోణాలు ఉన్నాయ్: ఏలేటి
- హిల్ట్ పాలసీకి చట్టబద్ధత లేదని ప్రతిపక్ష విమర్శలు



2014 నుంచి, ఇటీవల తమ ప్రభుత్వం తెచ్చిన హిల్‌ట్‌పీ తో పాటు ఇప్పటివరకు జరిగిన పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై ఏ విచారణను ఆదేశించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉంటే.. ఆ మేరకు లేఖ రాసిన మరుక్షణం ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం శాసనసభలో హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పిడి (హిల్ట్) విధానం (పీ), తెలంగాణ రైజింగ్-2047పై లఘు చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు భట్టి జవాబిచ్చారు.



హిల్ట్ పీతో రూ.10,776 కోట్ల ఆదాయం: 'ప్రతిపక్షం కడుపులో విషం పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధిని పట్టించుకోకుండా తమ రాజకీయం కోసం రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. తమకు కావాల్సిన వాళ్లకు పారిశ్రామిక భూములను వినియోగ మార్పిడి చేసింది. సిరీస్, గల్ఫ్ ఆయిల్ పరిశ్రమలకు భూ వినియోగ మార్పిడి చేసిన అంశాన్ని హిల్ట్ పాలసీతో పోల్చినప్పుడు రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.4,076 కోట్ల నష్టం వాటిల్లింది. హిల్ట్ పీ కింద కాంగ్రెస్ ప్రభుత్వం.. 80 అడుగుల లోపు రహదారి ఉన్న భూములకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్‌వో) ధరలో 30 శాతం, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పుతో రహదారి ఉన్నచోట ఎస్ఆర్‌వో ధరలో 50 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. కేవలం భూ వినియోగ మార్పిడి చేస్తున్నందుకు ఈ ఫీజులు వసూలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న భూ వినియోగ మార్పిడి ధరల ప్రకారం అయితే కేవలం రూ.574 కోట్ల ఆదాయం మాత్రమే రాష్ట్రానికి లభిస్తుంది.

మిగతా 2లో




## వరంగల్ కోటలో అక్రమ కట్టడాల తొలగింపునకు చర్యలు చేపట్టాలి

### సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

కాకతీయుల రాజధానిగా విరాజిల్లిన ఓరుగల్లు కోటలో అనేక అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం వాటిని తొలగించే చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. "ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు(వరంగల్) పట్టణం..

2లో



## భార్య వంట చేయలేదని విడాకులు కోరడం సమంజసం కాదు: హైకోర్టు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

భార్య వంట చేయలేదని చెప్పి భర్త విడాకులు కోరడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు భార్య వంట చేసేందుకు ఆస్కారం ఉండకపోవచ్చునని చెప్పింది. అంతేకాకుండా వంట చేయకుండా తన తల్లికి ఆమె సహకరించడం లేదని చెప్పి భార్య క్రూరత్వానికి పాల్పడిందనే భర్త వాదనను తోసిపుచ్చింది. వివరాలు ఇలా...ఎల్ఎల్‌బీ గ్రాడ్యుయేట్..సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని 2015, మేలో వివాహం చేసుకున్నారు.

2లో

## అబద్ధపు హామీలతో మోసం

- రైతు డిక్లరేషన్ హామీలు అన్నీ అబద్ధాలే: కేటీఆర్
- రాహుల్‌గాంధీ లీడర్ కాదు.. స్క్రిప్ట్ చదివే లీడర్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని స్థితి
- రేవంత్‌రెడ్డికి పాలనపై అవగాహన లేదని విమర్శలు
- కేసీఆర్‌ను ఉరి తీయాలన్న వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం
- జనగామలో బీఆర్ఎస్ సర్పంచుల అభినందన సభలో ప్రసంగం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

'వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతుబంధును రూ.15 వేలకు పెంచుతానన్నారు. కౌలుదారులకు కూడా ఇస్తానన్నారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తానన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఇవన్నీ అబద్ధాలు. అలాంటి హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాంధీనే నడిబజారులో ఉరితీయాలి..'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారక రామారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ లీడర్ కాదని, దేశంలో ఏకైక స్క్రిప్టు చదివే రీడర్ అని విమర్శించారు. స్క్రిప్టులో ఏమున్నా చదివేసే అవగాహన లేని నేత అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా? ఊడుతుందా? తెలియని పరిస్థితి ఉందన్నారు. సీఎంకు కూడా మూటలు మోసిన అనుభవం తప్ప మరేమీ లేదని, ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో




## ఎమ్మెల్సీ కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం

- కవిత రాజీనామాకు గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదం
- ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫికేషన్
- బీఆర్ఎస్ సస్పెన్షన్ అనంతరం పదవికి కవిత రిజైన్
- రాజీనామాపై పునరాలోచన సూచించిన మండలి చైర్మన్
- భావోద్వేగంగా మండలిలోనే ఆమోదానికి విజ్ఞప్తి
- నిజామాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ కవిత రాజీనామాకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు మంగళవారం నోటీఫికేషన్ జారీ చేశారు. కవిత రాజీనామాతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి సస్పెండైన తర్వాత ఆ పార్టీ ద్వారా లభించిన పదవి తనకు వద్దంటూ ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసిన కవిత.. మండలి చైర్మన్‌కు రిజైన్ లెటర్‌ను పంపించి ఆమోదం తెలపాలని కోరారు.

మిగతా 2లో

## కేసీఆర్ గ్రామాలను ముత్యాల్లా తీర్చిదిద్దారు: హరీశ్‌రావు

- గ్రామ పంచాయతీలను ముత్యాల్లా తీర్చిదిద్దిన కేసీఆర్: హరీశ్‌రావు
- రేవంత్ సర్కారులో పంచాయతీలు మురికికూపాలయ్యాయి
- కాంగ్రెస్ హయాంలో గ్రామాభివృద్ధి కుంటుపడింది
- సిద్దిపేట గ్రామాలకు గతంలో జాతీయ అవార్డులు
- కాళేశ్వరం వల్లే 80 వేల ఎకరాలకు సాగునీరు
- సర్పంచుల సన్మాన కార్యక్రమంలో హరీశ్‌రావు వ్యాఖ్యలు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

'మా ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను కేసీఆర్... ముత్యాల్లాగా తీర్చిదిద్దితే, రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం మురికికూపాలుగా మార్చేసింది' అంటూ మాజీ మంత్రి, శాసనసభలో భారాస ఉప నేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తన నియోజకవర్గం పరిధిలో గెలుపొందిన భారాస సర్పంచులు, ఉపసర్పంచులకు

మిగతా 2లో





## రాష్ట్రంలో ఈవీలకు పెద్దపీట

రాష్ట్రంలో విద్యుత్ వాహనా(ఈవీ)లకు పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వ వాహనాల్లో 30% ఈవీలు ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తగా అన్ని ప్రభుత్వ శాఖలు ఈవీలనే కొనుగోలుచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ బస్సులన్నింటినీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తున్నామని.. ఐటీ, ఫార్మా వంటి సంస్థలు వాటి అవసరాల్లో 25 నుంచి 50% విద్యుత్ వాహనాలు కొనే విధానం తేనున్నట్లు వెల్లడించారు. డీజిల్ ఆటోలు ఈవీకి మారే అవకాశం కల్పించామన్నారు. పెద్దఎత్తున స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈవీ విధానంపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# హిల్ట్ పాలసీపై ఏ విచారణకైనా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అదే హిల్ట్ పీ కింద దాదాపు 4,780 ఎకరాల భూములకు భూ వినియోగ మార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా దాదాపు రూ.10,776 కోట్ల ఆదాయం లభిస్తుంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

'హిల్ట్ పాలసీ రాగానే ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ఓ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రంలోని భూములన్నింటినీ అమ్మేస్తూ రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించి, బట్ట కాల్చి మీద వేసి తుడుచుకోమంటున్నారు. వారు రాష్ట్ర ప్రజా ప్రయోజనాల కంటే.. సొంత ప్రయోజనాల కోసం ఎక్కువగా పాకులాడుతున్నారు. హిల్ట్ పీ వల్ల రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంటే.. గతంలో వారు చేసిన నిర్ణయాలతో భారీ నష్టం జరిగింది. గత ప్రభుత్వం అనుసరించి విధానాలతో పోలిస్తే హిల్ట్ పీ అత్యుత్తమమైనది. పారదర్శకమైనది. ఆదాయం సమకూరుతుంది.

వారు ఆజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వ భూములు లీజులో ఉంటే... వాటిని వేలానికి పెట్టకుండా ఇష్టానుసారం ఇచ్చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పారిశ్రామికవేత్తలకు అప్పగించారు. వనరుల సమీకరణకు 2019లో అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీకి సంబంధం లేకుండా కేటీఆర్ పరిశ్రమల మంత్రిగా జీవో ఇచ్చి పారిశ్రామిక భూములను ఐటీ పరిశ్రమలకు మార్చేలా ఉత్తర్వులు ఇచ్చారు. వారికి అనుకూలమైన వారికి భూ మార్పిడి చేశారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. మేము తెచ్చిన పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు..' అని భట్టి చెప్పారు.

'ప్రస్తుతం రాష్ట్రం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. వృద్ధి ఇలానే కొనసాగితే 2047 నాటికి 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగానే ఎదుగుతాం. ఇది సరిపోదని..3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్-2047 తీసుకొచ్చాం. కేవలం ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం ద్వారా ఈ లక్ష్యానికి చేరుకోలేం. మనకు ఒక 'ఉత్పాదకత షాక్' అవసరం. పెట్టుబడి రేటును జీఎస్డీపీలో 52 శాతానికి పెంచాలనే కఠిన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం..' అని భట్టి తెలిపారు.

**తర్వలో హిల్ట్ పీ మార్గదర్శకాలు: శ్రీధర్‌బాబు**

పదేళ్ల పాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో చాలాచోట్ల అడ్డగోలు భూకేటాయింపులు జరిపిన విషయం వాస్తవమని.. తొలుత మాట్లాడిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పరిశ్రమల పేరిట జరిగిన ఈ భూకేటాయింపులపై తప్పకుండా విచారణ చేపడతామని చెప్పారు. 'హిల్ట్ పాలసీ ఏకపక్ష నిర్ణయం కాదు. నిపుణులు, మేధావులతో చర్చించిన తర్వాతే రూపొందించాం. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు త్వరలో విడుదలవుతాయి. మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులను పబ్లిక్ డొమైన్ (అందరికీ అందుబాటు)లో పెట్టం. అవి కేవలం ఇన్ కెమెరా (అంతర్గత) సూచనలు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను పాజిటివ్‌గా చూడాలి.



అప్పుడే నిర్ణయాల అమలు వేగవంతంగా, విజయవంతంగా పూర్తవుతుంది. పరిశ్రమల తరలింపుతో కార్మికులకు ఉపాధి ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన అవసరం లేదు. కార్మిక చట్టాలు తప్పకుండా అమల్లో ఉంటాయి..' అని శ్రీధర్‌బాబు చెప్పారు.

**పూర్తి పారదర్శక పాలసీ: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

పారిశ్రామిక భూమి బదలాయింపు విధానం రాష్ట్ర సుస్థిర పురోగతితో పాటు పారిశ్రామిక కాలుష్య రహిత హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు దోహదం చేస్తుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పూర్తి పారదర్శకంగా ఉండేలా గొప్ప పాలసీకి రూపకల్పన చేశామని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అర్థరహిత విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. లీజు హక్కులతో ఉన్న పారిశ్రామిక భూములకు ఈ కొత్త విధానం వర్తించదని, పూర్తిస్థాయి యాజమాన్య హక్కులతో భూములు కలిగిఉన్న పారిశ్రామిక భూములకే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

**ఆ జీవోలో చీకటి కోణాలు: ఏలేటి**

'కాలుష్య కారక పరిశ్రమలను నగరం బయటకు పంపడం సరైన నిర్ణయమే. కానీ ఎలాంటి పర్యావరణ అధ్యయనాలు, కమిటీల నివేదికలు లేకుండా బయటకు తరలే పరిశ్రమలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించకుండా హడావుడిగా హిల్ట్ పాలసీని తేవడంలో ఆంతర్యం ఏమిటి? ప్రభుత్వం జారీ చేసిన జీఓ 27లో అనేక చీకటి కోణాలు ఉన్నాయి. 22 పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఎక్కడికి తరలిస్తారు? అత్యంత కాలుష్య కారక పరిశ్రమలున్న ఐడీఏ బొల్లారంను హిల్ట్ పాలసీలో చేర్చకపోవడం విడ్డూరం..' అని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పరిశ్రమల భూములతో రియల్ ఎస్టేట్ దందా చేయడాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పచ్చదనం పెంచాలి..' అని సూచించారు. రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన హిల్ట్ పాలసీని అందరూ స్వాగతించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వాయు నాణ్యత వేగంగా క్షీణిస్తోందని, ఇదే తరహాలో కాలుష్యం పెరిగితే పదేళ్లలో ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తుతాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

**ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు: పాల్వాయి హరీశ్‌బాబు**

'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్-2047 విడుదల చేశారు. ఇప్పుడు అక్కడ టెంట్లు కూడా లేవు. ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు..' అని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని మరో బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ అన్నారు.

**హిల్ట్ పాలసీకి చట్టబద్ధత లేదు: అక్బరుద్దీన్**

'వనరుల సమీకరణకు ఈ ప్రభుత్వం భూముల వెనుక పరిగెడుతోంది. ప్రభుత్వం విడుదల చేసిన హిల్ట్ పాలసీ జీఓకు ఎలాంటి చట్టబద్ధత లేదు. పాలసీ రూపకల్పనలో పారదర్శకత కనిపించడం లేదు. పాలసీలో పేర్కొన్న భూములు ప్రైవేటువా లేక ప్రభుత్వ భూములా అనే అంశంపై ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలి..' అని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుదీన్ ఒవైసీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 50 ఎకరాలను వెనక్కి తీసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. నగర కాలుష్యాన్ని నివారించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీకి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చెప్పారు. కాగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడిన తర్వాత శాసన సభ నిరవధికంగా వాయిదా పడింది.



## రాష్ట్రంలో ఈవీలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

"దిల్లీలో మాదిరిగా తెలంగాణలో కాలుష్యం తీవ్రరూపం దాల్చకుండా.. జీవో41 ద్వారా ఈవీ విధానం తెచ్చాం. ప్రభుత్వానికి భారమైనా రూ.900 కోట్ల మేర ప్రోత్సాహకాలిచ్చాం. ఏడాదిలోనే లక్ష వాహనాల కొనుగోళ్లు జరిగాయి. హైదరాబాద్‌కు పీఎం ఈడ్రైవ్ కింద 2,800 బస్సులు దశలవారీగా వస్తున్నాయి.

ఆర్టీసీలో ప్రయాణికుల సౌకర్యం, కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నాం. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల రద్దుకు సంబంధించి త్వరలోనే ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం.



రాష్ట్రంలో వాహన కాలుష్య నియంత్రణకు రవాణాశాఖ కఠిన చర్యలు తీసుకుంది. ఫిట్‌నెస్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై గత 24 నెలల్లో హైదరాబాద్‌లో 51,310 కేసులు నమోదు చేశాం. రూ.6.66 కోట్ల జరిమానా వసూలు చేశాం" అని మంత్రి పొన్నం వివరించారు.

## భార్య వంట చేయలేదని విడాకులు కోరడం సమంజసం కాదు: హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

వైద్య సమస్యల కారణంగా 2017లో ఆమెకు గర్భస్రావమైంది. ఆ తర్వాత గృహ కలహాలతో 2018, అక్టోబర్ నుంచి ఇద్దరూ విడివిడిగా నివసిస్తున్నారు. ఈ క్రమంలో విడాకులు కోరుతూ భర్త మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో దావా వేశారు.

జిల్లా కోర్టు విడాకులకు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ భర్త హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన భార్య తనకు వంట చేయడంలో విఫలమైందని, తన తల్లికి రోజువారీ పనుల్లో సహకరించడం లేదన్న అతని ఆరోపణను తప్పుబట్టింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కావడంతో విభిన్న పనివేళల దృష్ట్యా ఆమె వంట చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించలేమని, దానిని క్రూరత్వంగా పేర్కొనలేమని అభిప్రాయపడింది. చిన్న చిన్న సమస్యలతో విడాకుల వరకు వెళ్లవద్దని సూచిస్తూ.. అప్పీల్‌ను కొట్టివేసింది.

## ఎమ్మెల్సీ కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామాపై పునరాలోచించుకోవాలని మండలి చైర్మన్ కవితకు సూచించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని కవిత.. 2026, జనవరి 5న మండలి వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురవుతూ తన రాజీనామాను ఆమోదించాలని మరోసారి చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. అన్ని ఆలోచించి రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆమె స్పష్టం చేశారు. ఈ క్రమంలో కవిత రాజీనామాకు మంగళవారం (జనవరి 6) చైర్మన్ గుత్తా ఆమోదం తెలిపారు.



కాగా, బీఆర్ఎస్ పార్టీ తరుఫున నిజామాబాద్ లోకల్ బాడీ నియోజకవర్గం నుంచి కవిత ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే.. పార్టీ లైన్ క్రాస్ చేసిందన్న ఆరోపణలపై బీఆర్ఎస్ కవితను సస్పెండ్ చేసింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ ద్వారా వచ్చిన పదవి తనకు అవసరం లేదని కవిత ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేశారు.

## వరంగల్ కోటలో అక్రమ కట్టడాల తొలగింపునకు చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

మన వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోంది. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటానికి ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారు. ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలున్నాయి. వీటిని కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూములలో అనేక కట్టడాలు చేపట్టారు. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ఇప్పటికే అనేక నోటీసులు ఇచ్చారు. నేను కూడా పలుమార్లు కలెక్టర్‌కు లేఖలు రాసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రెవెన్యూ రికార్డులలో కోట భూములను భారత పురావస్తుశాఖ(ఏఎస్ఐ)కు చెందినవి అని కాకుండా ప్రభుత్వం అని



పేర్కొన్నారు. దీంతో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో ఏఎస్ఐకి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని, ఏఎస్ఐకి అవసరమైన సహకారం అందించాలి" అని కిషన్‌రెడ్డి లేఖ ద్వారా కోరారు.

## అబద్ధపు హామీలతో మోసం

(మొదటి పేజీ తరువాయి)

జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లాలో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచుల అభినందన సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**రేవంత్‌కు పిచ్చి ముదిరి పాకానపడింది**



'రాష్ట్రంలో చెక్‌డ్యాంలు పటాకులు పేలినట్లు పేలుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అట్లనే ఉంది. రాష్ట్రంలో పాలిచ్చే బర్రెను కాదనుకుని, వెనకనుంచి తన్నే గేదెను తెచ్చుకున్నామని ప్రజలు మథనపడుతున్నారు. గోదావరి ఎక్కడుందో కూడా రేవంత్‌కు తెలియదు. భాక్రానంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెబుతున్న రేవంత్‌రెడ్డి..రాష్ట్రాన్ని ఎలా నడిపిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతోంది.. ప్రజలకు చేసిన వాగ్దానాలు ఎంతవరకూ నెరవేర్చారో ఒక్కసారి ఆలోచించాలి. ఎనకటి రోజులు తెస్తానన్న రేవంత్, రాబందు కాలం తీసుకువచ్చారు. తెలంగాణను అభివృద్ధి చేసిన నాయకుడిని (కేసీఆర్)ఉరి తీయాలంటారా?.

ఇంటింటికీ నీళ్లు ఇచ్చి, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌ను ఉరి వేయాలని రేవంత్‌రెడ్డి అనడం చూస్తుంటే ఆయనకు పిచ్చి ముదిరి పాకాన పడిందని అర్థమవుతోంది. ఆ మాటకొస్తే హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాందీనే ఉరి తీయాలి. తన సొంత సెక్యూరిటీని కూడా ప్రజల ముందే కొట్టే ముఖ్యమంత్రి ఎక్కడా దొరకడు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ చెప్పు దూళికీ రేవంత్ సరిపోడు. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కే ఆయన ఆగమాగం అవుతున్నాడు. ఇక అసెంబ్లీలో మాట్లాడితే అక్కడే గుండె ఆగిపోయి సచ్చిపోతారు..'అని కేటీఆర్ విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ గ్రామాలను ముత్యాల్లా తీర్చిదిద్దారు: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం సిద్దిపేటలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... "కేసీఆర్ హయాంలో ప్రతి చిన్న గ్రామపంచాయతీకి సైతం ట్రాక్టర్, వైకుంఠధామం, డంప్‌యార్డు వసతులను సమకూర్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల తర్వాత ఎన్నికలు నిర్వహించడంతో అభివృద్ధి కుంటుపడింది. సిద్దిపేట నియోజకవర్గంలోని గ్రామాలు అత్యధిక అవార్డులు సాధించాయి. ఈ ప్రభుత్వ హయాంలో అవార్డులు రాలేదు సరికదా... అధ్వానంగా మార్చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఇప్పటివరకు సొంత డబ్బులతో పనులు చేశారు. మొన్నటివరకు ఎన్నికలు పూర్తికాక 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ఇప్పుడు నేరుగా సర్పంచుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయి. సిద్దిపేట ప్రాంతంలో ఎనిమిదేళ్ల క్రితం ఎనిమిది వేల ఎకరాల్లోనే వరి సాగయ్యేది. ఇప్పుడదే వరి 80 వేల ఎకరాల్లో పండుతోంది. ఇదంతా కాళేశ్వరం సంబంధిత జలాశయాలతోనే సాధ్యమైంది. కాళేశ్వరం కూలిందన్న రేవంత్‌రెడ్డి.. ఇన్ని వేల ఎకరాలకు నీరెలా వచ్చిందో చెప్పాలి" అని ప్రశ్నించారు.





# మల్లాపూర్‌లో బస్‌స్టాప్ షెడ్డుల ఏర్పాటు చేయాలి

- నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ ప్రాంతంలో బస్‌స్టాప్‌ల వద్ద షెడ్డులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.మల్లాపూర్ డివిజన్‌లోని మల్టీ స్టీల్ కంపెనీ నుంచి ఎన్‌ఎఫ్సీ రోడ్ మార్గంలో ఉన్న మల్టీ స్టీల్ బస్‌స్టాప్‌తో పాటు మల్లాపూర్ పరిధిలోని పలు బస్‌స్టాప్‌ల వద్ద షెడ్డులు లేక వర్షం, ఎండలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.ఈ సమస్యపై మంగళవారం నాడు నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందను కలిసి నూతన బస్‌స్టాప్ షెడ్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ సమస్యను పరిశీలించి త్వరలోనే అవసరమైన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి రాంచందర్, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగవీటి రంకు, శ్రవణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే నా తొలి ప్రాధాన్యత

- ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం
- మల్లక్ సురేష్ కుమార్(వెల్టూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు)

**పెద్దమందడి,జనవరి6(తెలంగాణ ముచ్చట్లు):**



గ్రామ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని వెల్టూర్ బీఆర్ఎస్ నేత మల్లక్ సురేష్ కుమార్ అన్నారు. వెల్టూర్ -చిలకటోనీ పల్లి పరిధిలో జరగనున్న ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.మల్లక్ సురేష్ కుమార్ తెలంగాణ ఉద్యమ కారుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2006 నుంచి 2008 వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.2008-2010 కాలంలో రుక్కన్నపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2010-2014 మధ్య ఖిల్లా ఘనపూర్ మండలంలో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.2016-2018లో పెద్దమందడి ఆర్గనైజేషన్ కార్యదర్శిగా పనిచేశారు.2019 నుంచి 2024 వరకు వెల్టూర్ గ్రామ పంచాయతీలో 4వ వార్డ్ మెంబర్‌గా ప్రజా ప్రతినిధిగా కొనసాగుతూ..ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. ప్రస్తుతం (2024-2026) వెల్టూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.గ్రామంలో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రైతు సంక్షేమం, యువత ఉపాధి అవకాశాల కల్పనతో పాటు మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. ప్రజల నమ్మకంతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతానని పేర్కొంటూ.. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి

- ధర్మసాగర్ ఎస్సై దిలీప్

**ధర్మసాగర్,జనవరి06(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ కేంద్రంలో జాతీయ రహదారి భద్రతా మాసం కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీధర్ రావు ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డ్రైవర్లకు వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత, అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదకరమని వివరించారు. అలాగే రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన విధానం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ ఎస్ఐ ఎల్. దిలీప్‌తో పాటు ధర్మసాగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రహదారి ప్రమాదాలు తగ్గాలంటే ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని పోలీసులు తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

–వీసీపీసీ సమావేశంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడి,జనవరి6(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం మణిగిళ్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పాల్గొని బాలల సంక్షేమం, బాలికల భవిష్యత్‌పై ముఖ్య సూచనలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే వివాహం జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు జరగడం వల్ల చదువుకు దూరమవడం, అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడం వంటి అనేక ఇబ్బందులు చిన్న వయసులోనే ఎదురవుతాయని తెలిపారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని, అలాంటి ఆలోచనలు తల్లిదండ్రుల్లో ఉంటే వారికి అవగాహన కల్పించి బాలికలను చదువు వైపు మళ్లించాల్సిన బాధ్యత మనందరిదేనని స్పష్టం చేశారు.అలాగే గ్రామంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నమోదు అయిన పిల్లలు శాతం శాతం హాజరయ్యేలా చూడాలని, వారికి సకాలంలో బాలామృతం, పాలు, గుడ్లు అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. అవసరమైతే గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారి పిల్లలకు పోషకాహారం అందేలా చూడాలని తెలిపారు.పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి తగిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో పేర్కొన్నారు.ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా అందరూ కలసి కృషి చేయాలని, అలాగే గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతినెల జరిగే తల్లిదండ్రుల సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఉపసర్పంచ్ ముప్పూరీ గణేష్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, క్షేత్ర సహాయకుడు రాంరెడ్డి, ఆరోగ్య కార్యకర్త అంజనమ్మ, అంగన్వాడీ ఉపాధ్యాయులు అరుణ, రాధా, ప్రమీల, ఆశా కార్యకర్తలు బాలమ్మ, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.







# కీసర ఠాణా పరిధిలో సంచలన జ్యువెలరీ షాప్ దోపిడీ

- రెండు రోజుల్లోనే ఐదుగురు నిందితుల అరెస్ట్

**నాగారం, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం డివిజన్ సత్యనారాయణ కాలనీలో జరిగిన సంచలన జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును కీసర పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే ఛేదించారు. నాగారం బాలాజీ జ్యువెలరీ షాప్‌లో పట్టపగలు జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ నెల 2వ తేదీన బిఎన్ఎస్ సెక్షన్ 309(4), ఆయుధాల చట్టం సెక్షన్ 27 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జనవరి 2న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఏ 3, ఏ 4 నిందితులు కస్టమర్లుగా నటిస్తూ జ్యువెలరీ షాప్‌లోకి ప్రవేశించారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించుకున్న అనంతరం బయట వేచి ఉన్న ఏ 1, ఏ 2లకు సంకేతం ఇవ్వగా, వారు గొడ్డలి, డమ్మీ పిస్టల్‌తో ఆయుధాలు ధరించి షాప్‌లోకి చొరబడ్డారు.ఈ సందర్భంగా షాప్ యజమాని సందీప్ గెహ్లోత్‌ను అడ్డుకోవడంతో గొడ్డలితో దాడి చేయగా, ఆయనకు తలపై తీవ్ర గాయమైంది. నగలను దోచుకునేందుకు ప్రయత్నించినప్పటికీ బాధితుడు ధైర్యంగా ఎదుర్కొని నగల బ్యాగ్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో, నిందితులు బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. అయితే కొంతమేర బంగారు మట్టీలు మాత్రమే వారు తీసుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టైన నిందితులు: (ఏ 1) నజీమ్ అజీజ్ కొటాడియా -కొంపల్లి, వ్యాపారి. (ఏ 2) బిషకర్మ ఎకందర్ సింగ్ - రామ్‌కోటి, కూలీ. (ఏ 3) మొహమ్మద్ సైఫ్ అలీ అలియాస్ అద్నాన్ - కింగ్‌కోఠి, ఏసీ మెకానిక్. (ఏ 4)రాజేందర్ సింగ్ అలియాస్ రాజ్ సింగ్ - మెహదీపట్నం (నేపాల్‌కు చెందినవాడు).(ఏ 5) రతన్ సింగ్ బహదూర్ అలియాస్ రతన్ - మెహదీపట్నం.నేరచరిత్ర:ఏ 1 నుంచి ఏ 3 వరకు పలుచోట్ల దోపిడీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని, ఏ 5 గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఏ 1పై గతంలో పీడీ యాక్ట్ కూడా నమోదై ఉందని వెల్లడించారు.నిందితుల నుంచి మారుతి బలెనో కారు, బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం, డమ్మీ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగర శివారుల్లోని జ్యువెలరీ షాప్‌లను ముందుగా గమనించి, సాయంత్రం వేళ దోపిడీలకు పాల్పడి దొంగిలించిన వాహనాలతో పరారవడం వీరి అలవాటని పోలీసులు తెలిపారు.ఈ కేసును మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఐపీఎస్, ఎస్వోటీ డీసీపీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఛేదించగా, కీసర ఎస్‌హెచ్‌వో అంజనేయులు, ఎస్వోటీ, క్లూస్ టీమ్ అధికారులు కీలక పాత్ర పోషించారు.

# చెంగనూరులో తెలుగు అయ్యప్ప భక్తులకు అన్నదానం

- ఉప్పల్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం

**మేడ్చల్ మల్కాజ్గిరి, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** మండల మకరవిల సందర్భంగా శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తుల తాకిడి అశేషంగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో, వారి సౌకర్యార్థం చెంగనూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మహాశాస్త్ర సేవా సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఉప్పల్ రాజు గురుస్వామి నేతృత్వంలో ఈ అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. శబరిమల యాత్రకు వచ్చే అయ్యప్ప భక్తులకు ప్రత్యేకంగా తెలుగు రుచులతో అన్న ప్రసాదాన్ని అందించడం ఈ కార్యక్రమ ప్రత్యేకతగా నిలిచింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రుద్రగోని వెంకటేష్ గౌడ్ గురుస్వామి మాట్లాడుతూ, హైదరాబాదు నుంచి కేరళ రాష్ట్రం శబరిమల ప్రాంతంలో తెలుగు అయ్యప్ప భక్తుల కోసం అన్నదానం నిర్వహించడం ఎంతో గొప్ప సేవ అని కొనియాడారు. తెలుగు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించడంపై నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమంలో రుద్రగోని వెంకటేష్ గౌడ్ గురుస్వామి తన



శిష్య బృందావనంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులతో కలిసి అన్న ప్రసాద సేవలో పాల్గొని భక్తులకు సేవలందించారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- సైనిక్పురి విద్యుత్ ట్రాన్స్మిషన్ డీఈ అన్వర్ పాష

**కుషాయిగూడ, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):**



సైనిక్పురి విద్యుత్ డివిజనల్ పరిధిలోని అన్ని కాలనీలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపడుతున్నామని సైనిక్పురి విద్యుత్ ట్రాన్స్మిషన్ డివిజనల్ ఇంజనీర్ అన్వర్ పాష తెలిపారు.కుషాయిగూడ, చర్లపల్లి ఎన్ఎన్ కాలనీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఇటీవల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో, సమస్య తలెత్తిన వెంటనే మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ కాలనీ కమిటీల సమాఖ్య (సీసీఎస్) అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి మంగళవారం డీఈ అన్వర్ పాషకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డీఈ అన్వర్ పాష మాట్లాడుతూ, ఎన్ఎన్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తిన విషయాన్ని గుర్తించి వెంటనే అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నాగారం సబ్‌స్టేషన్ నుంచి లింక్ ద్వారా విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.రూ.50 లక్షలతో కొత్త 11 కేవీ బైఫర్కేషన్ ఫీడర్ సబ్‌స్టేషన్‌లపై భారం తగ్గించేందుకు నాగార్జున కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన 11 కేవీ విద్యుత్ బైఫర్కేషన్ ఫీడర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వారం రోజుల వ్యవధిలో కొత్త ఫీడర్‌ను ప్రారంభించి విద్యుత్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు డీఈ అన్వర్ పాష వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఏడీఈ రాందాస్, కుషాయిగూడ సెక్షన్ ఏఈ బాలరాజ్, శివసాయి నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు బర్ల రామచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంస జ్ఞాపికలను అందుకుంటున్న చిన్నారులు

# గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన సదాశ్రీ కూచిపూడి కళాక్షేత్రం బృందం

**కాజీపేట్, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు 5000 మంది కళాకారులతో కూచిపూడి కళా వైభవం 2 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజిపేటకు చెందిన సదాశ్రీ కూచిపూడి కళాక్షేత్రం గురువు రేవతి శిష్య బృందం కూడా పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో చోటు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పోర్ట్స్ మినిస్టర్ వాకిటి శ్రీహరి హాజరై పిల్లలు అన్ని రంగాలలో రాణించాలని ఈ సందర్భంగా తెలిపారు. పిల్లల్ని ఈ రంగంలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను గురువులను ఆయన అభినందించారు. అనంతరం గురువులకు పిల్లలకు ప్రశంస జ్ఞాపికలను అందించారు. ఈ అవార్డు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రాజ్‌సుక్‌నగర్‌లో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

**నాగారం, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి పరిధిలోని నాగారం డివిజన్ రాజ్‌సుక్‌నగర్ కాలనీలో మదర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఫౌండర్ కమ్ ప్రెసిడెంట్ బొజ్జ సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి వృత్తి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు నేర్చుకున్న నైపుణ్యాలను వినియోగించుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకటరెడ్డి, పంగ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నం రాజ్ సతీష్ గౌడ్, గణపురం కొండల్ రెడ్డి, 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.అలాగే కాలనీ అధ్యక్షులు దాసు, సంజయ్, బండారి రమేష్, వీరయ్యతో పాటు కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో కార్గో పార్సిళ్ల వేలం



**కుషాయిగూడ, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో కార్గో ద్వారా పంపించి గడువు మించిపోయినప్పటికీ తీసుకెళ్లని పార్సిళ్లను వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు.ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కుషాయిగూడ ఆర్టీసీ డిపో గేటు ఆవరణలో ఈ వేలం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ప్రజలు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వేలంలో పాల్గొని, గడువు మించిన కార్గో పార్సిళ్లను పొందవచ్చని డిపో మేనేజర్ సూచించారు.




## ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం



**ఖమ్మం బ్యూరో, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బోనకల్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డు వారి ప్రోత్సాహం తో కళాజాత కళాకారులు ఆర్థిక అక్షరాస్యత సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం బోనకల్ మండలం పెద్దబీరెల్లి గ్రామం లో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ మేనేజర్ ఏ . శ్రవణ్ కుమార్ , ఫీల్డ్ ఆఫీసర్ బి. సురేష్ ,సిబ్బంది ఆర్ . భిక్షం, గ్రామ సర్పంచ్ చింతల చెర్వు. కోటేశ్వరరావు గ్రామ దీపిక యనమద్ది రాజకుమారి, సి ఎస్ పి వెంకన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు. బ్యాంక్ లావాదేవీలు గురించి అవగాహన సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు గురించి వినూత్నంగా కళాకారులు ప్రజలకి అర్థమయ్యే రీతిలో ప్రదర్శన ద్వారా తెలియచేశారు.

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**పెద్దమందడి,జనవరి6(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సింగిరెడ్డి బయగాళ్ల నాగన్న (50) సోమవారం ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు ఈ సమాచారాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు.మృతుని కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి మానవత్వంతో స్పందించి, కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు అవసరమైన సహాయంతో పాటు, కష్ట సమయంలో తమకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త సూర్య రవి, మాజీ జెడ్పీటీసీ కొమ్ము వెంకట స్వామి, కాంగ్రెస్ నాయకులు కొండన్న, కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, మన్యం, శ్రీను, కురుమూర్తి, నరసింహ, మైబూ, శ్రీనివాసులు, మాసులు తదితరులు పాల్గొన్నారు.కష్టకాలంలో తమను వెతుక్కుంటూ వచ్చి ఆదుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి పెద్ద మనసును చూసి మృతుని కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలను పంచుకునే ఎమ్మెల్యే మేఘారెడ్డి దాతృత్వంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.






# కాప్రా సర్కిల్‌లో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమం

- జీవీపీ వద్ద చెత్త వేయకుండా సీసీ కెమెరాలు, మైక్ ఏర్పాటు

**కాప్రా, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని అన్ని జీవీపీ (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు)లను చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని ఆదేశాల మేరకు, కాలనీ వాసుల భాగస్వామ్యంతో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.కాప్రా డివిజన్ పరిధిలోని పద్మారావు నగర్-శ్రీగురు రాఘవేంద్ర నగర్ కాలనీల మధ్యలో, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో జీవీపీ వద్ద చెత్త పడకుండా సీసీ కెమెరాలు, మైక్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీహరి తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని సూచించారు.అలాగే చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్ కాలనీలో కూడా అసోసియేషన్ భాగస్వామ్యం తో ఈసీ నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో



డిప్యూటీ ఇంజనీర్ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, ధర్మేందర్, ఎస్ఎఫ్ఏలు వసంత, సంజీవ, అంజలి, కోటేశ్వరి, వరలక్ష్మి, రామ్, సూపర్వైజర్ రోనిత్, శానిటేషన్ సిబ్బంది మరియు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.






# కొత్త పేరు ట్యాగ్ లైన్ సూచించండి..

- 4 వేల రూపాయల బహుమతి గెలుచుకోండి....
- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 6(తెలంగాణ ముచ్చట్లు)** వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు కొత్త పేరు, ట్యాగ్ లైన్ సూచించి, నాలుగు వేల రూపాయల బహుమతి గెలుచుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్క్ పబ్లిక్ కాంపిటీషన్ గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్త పేరు, ట్యాగ్ లైన్, అధికారిక లోగో తయారు చేయాలని అటవీ శాఖ నిర్ణయించిందని, ఇందులో భాగంగా పబ్లిక్ కాంపిటీషన్ చేపడుతున్నట్లు తెలిపారు. జనవరి 10 నుంచి జనవరి 20 వరకు పబ్లిక్ కాంపిటీషన్ ఉంటుందని, ఆసక్తి గలవారు వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్త పేరు ట్యాగ్ లైన్ సూచించాలని, విజేతలకు 4 వేల రూపాయల బహుమతి లభిస్తుందని అన్నారు. అలాగే వెలుగుమట్ల అర్బన్ పార్కు కొత్త అధికారిక లోగో డిజైన్ చేసే వారికి కూడా 4 వేల రూపాయలు బహుమతి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఎఫ్డీవో మంజుల, తహసీల్దార్లు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ది హెయిర్ బ్లో సెలూన్ ప్రారంభించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ భగయత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ది హెయిర్ బ్లో సెలూన్'ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి మంగళవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,"సెలూన్ అనేది కేవలం హెయిర్ కట్ లేదా హెయిర్ స్టైల్‌కు మాత్రమే పరిమితం కాదు. ఇది యువతలో ఆత్మవిశ్వాసం పెంచే, వ్యక్తిత్వాన్ని మెరుగుపరచే, పరిశుభ్రతపై అవగాహన కల్పించే ఒక వేదిక" అని పేర్కొన్నారు.






ఇలాంటి ఆధునిక వ్యాపారాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సెలూన్ యాజమాన్యులు పయ్యావుల మోహన మురళి, పయ్యావుల శ్రీనివాస్, పయ్యావుల భరత్ కుమార్, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, అలుగుల అనిల్, జనగామ రామకృష్ణ, సురేష్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా కదలిరావాలి: ఈగల్ టీం డీఎస్పీ సైదులు

**నాచారం, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ అత్యంత కీలకమని ఈగల్ టీం డీఎస్పీ సైదులు అన్నారు. నాచారం యాంటీ డ్రగ్స్ ఫోరం నిర్వాహకులు, మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి, నందికొండ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాచారం చౌరస్తా నుంచి హెచ్ఎంటి నగర్ పార్క్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు కాలనీలలో ర్యాలీ సాగుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ సైదులు మాట్లాడుతూ, యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణను ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ క్రయవిక్రయాలకు పాల్పడితే వెంటనే 1908 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నాచారం యాంటీ డ్రగ్స్ ఫోరం నిర్వాహకులను ఆయన అభినందించారు.మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి, నందికొండ శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణపై రెండవసారి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో నాచారం పోలీస్ సిబ్బంది, ఈగల్ టీం సిబ్బంది, నాచారం మరియు హెచ్ఎంటి నగర్ డెవలప్మెంట్ ఫోరమ్ సభ్యులు పాల్గొన్నారు.

# కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- చైనా మాంజా విక్రయించిన, వినియోగించిన చర్యలు
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం బ్యూరో, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):** కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని.. చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైనా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జరగకుండా తీసుకుంటున్న చర్యలలో భాగంగా గతంలో కోడిపందేలు, పేకాట స్థావరాలు నిర్వహించిన వారిని బైండోవర్ చేయాలని, అదేవిదంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. టాస్క్ ఫోర్స్, నిఘా విభాగాలు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి కోడిపందాలను కట్టడి చేయాలని ఆదేశించారు.

**చైనా మాంజా విక్రయించిన, వినియోగించిన చర్యలు**

పక్షులతో పాటు, ప్రజలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను ఎవరైనా విక్రయించిన, వినియోగించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సంక్రాతి పండుగ సమిపిస్తున్న వేళ యువత గాలి పటాలను ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో యువత అధికంగా చైనా మాంజా ఉపయోగించి గాలి పటాలను ఎగుర వేయడం ఆసక్తి కనబరుస్తారు. కాని యువత వినియోగించే చైనా మాంజా (సింథటిక్ దారం, గాజు పొడి) చాలా ప్రమాదకమని, ఈ దారాన్ని ఉపయోగించడం ద్వారా పక్షుల గొంతు, రెక్కలు తెగిపోవడం, మనుషులకు గాయాలు కావడం జరుగుతుంది.ఎవరైనా చైనా మాంజా విక్రయించిన వినియోగించిన జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. చట్టవిరుద్ధమైన చైనా మాంజా నియంత్రణ కై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా చైనా మాంజా విక్రయాలకు పాల్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.



# పండుగ రోజుల్లో మల్కాజిగిరి మీదుగా ప్రత్యేక రైళ్లు నడపాలి

- సికింద్రాబాద్ రద్దీ తగ్గి భద్రత పెరుగుతుంది : జెడ్ఆర్యూసీసీ మెంబర్ నూర్




**మల్కాజిగిరి, జనవరి 06 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి రైల్వే స్టేషన్ లో సంక్రాంతి పండుగల సందర్భంగా రైల్వే శాఖ నడిపే ప్రత్యేక రైళ్లను సికింద్రాబాద్‌కు బదులుగా మల్కాజిగిరి మీదుగా మళ్లించాలని జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్యుసిసి) సభ్యుడు నూర్ కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో అక్కడ తీవ్ర రద్దీ నెలకొంటోందని ఆయన పేర్కొన్నారు.కాజిపేట్, నల్గొండ వైపు వెళ్లే మరియు అక్కడి నుంచి వచ్చే రైళ్లను మల్కాజిగిరి మీదుగా నడిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సుమారు 50 శాతం మంది ప్రయాణికులు మల్కాజిగిరి స్టేషన్‌లోనే ఎక్కి దిగే అవకాశం ఉండటంతో సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి గణనీయంగా తగ్గడమే కాకుండా భద్రతా పరంగానూ మేలు జరుగుతుందని వివరించారు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు 2026 మార్చి నాటికి తుది దశకు చేరుకుంటాయని, అప్పటిలోపు పండుగ సమయాల్లో రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను మల్కాజిగిరి స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేశారు.అలాగే కొమరవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం రోజునే మల్కాజిగిరిలో ఆర్పీఎఫ్ (ఆర్ పి ఎఫ్) కార్యాలయాన్ని, ఆర్‌కే నగర్ మరియు ఆల్వాల్ రైల్వే స్టేషన్లను కూడా ప్రారంభించాలని ఆయన రైల్వే అధికారులను కోరారు. ఇవి అమలులోకి వస్తే ఉత్తర హైదరాబాద్ ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతుందని నూర్ స్పష్టం చేశారు.

# మనుషులెందుకు ఏఐ ఏజెంట్లుండగా



సాఫ్ట్‌వేర్ వ్యాపార సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు, వ్యవస్థాపకుల నెట్‌వర్కింగ్ సంస్థ ఎస్ఏఏఎస్‌టీఆర్ వ్యవస్థాపకుడు, ఎస్ఏఏఎస్ కు పితామహుడుగా పరిగణించే జేసన్ లెమ్కిన్ ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. కంపెనీ నుంచి ఇద్దరు హై ప్రొఫైల్ ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నట్లుండి వెళ్లడంతో.. ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టారు. ఒక్కో జూనియర్ సేల్స్ రెప్రెజెంటేటివ్‌ని 1.5 లక్షల డాలర్ల వార్షిక జీతం (దాదాపు రూ.1.35 కోట్ల) తో నియమించుకోవడం బదులు, ఏఐ (కృత్రిమమేధ) ఏజెంట్లను రంగంలోకి దింపారు. తన మార్కెట్ టీంలో చివరి వ్యక్తి రాజీనామా అనంతరం, మొత్తం బృందాన్ని ఏఐ ఏజెంట్లతో నింపేశారు. భవిష్యత్తులోనూ విక్రయ విభాగంలో మనుషులను నియమించేది లేదని ఆయన చెబుతున్నారు. వర్చువల్ అసిస్టెంట్లయిన ఏఐ ఏజెంట్ల ద్వారానే సమస్యల పరిష్కారం, ప్రణాళికల రూపకల్పన, చర్యలు తీసుకోవడం వంటి పనులన్నీ స్వయంచాలకంగా చేసేలా కొత్త ఆపరేటింగ్ మోడల్‌ను సిద్ధం చేశారు. ఈ మోడల్‌లో 1.2 మంది మనుషులు, 20 ఏఐ ఏజెంట్లను నిర్వహిస్తున్నారు. అంతక్రితం 10 ఎస్‌డీఆర్‌లు, ఏఈలు ఉండేవారు. ఏఐ ఏజెంట్ల వల్ల ఉత్పాదకత పెరిగినా, వాటికి పరిమితులైతే ఉంటాయని విశ్లేషకులు అంటున్నారు.





# గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల కీలకపాత్ర

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, జనవరి -06(తెలంగాణ ముచ్చట్లు)**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులకు కీలకపాత్ర ఉంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి 65 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా నియామకం చేస్తూ ఉత్తర్వుల ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామాలలో పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, గ్రామ పంచాయతీలలో పన్నుల వసూలు, ప్రజలకు మెరుగైన వసతుల కల్పన, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులకు ఉంటాయని, ప్రతి ఒక్కరు మరింత బాధ్యతగా తమ విధులను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# శ్రీరామణపురంలో రూ.98 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులు పరిశీలన

- పనుల నాణ్యత, సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

**రామంతాపూర్, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని రామంతాపూర్ శ్రీరామణపురం కాలనీలో రూ.98 లక్షల వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల కాలనీల్లో నిర్వహించిన పర్యటనలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, డీఈ వెన్నెల్ గౌడ్, ఏఈ రాజ్ కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు రజినీకాంత్ రెడ్డి, శ్రీవాణి తదితరులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అదే విధంగా త్వరలోనే చర్చి కాలనీలో రూ.1 కోటి 9 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు కొత్త మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు. అభివృద్ధి పనుల ద్వారా కాలనీవాసుల సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామణపురం కాలనీ అధ్యక్షులు రత్నారెడ్డి, రాఘవేందర్, రాములు, లూద్ రెడ్డి, సతీష్, పోలిశెట్టి సుధాకర్, శర్మ, పాండు, కృష్ణ, స్వామి, రాము, డేవిడ్, బాల, లక్ష్మి, కృష్ణవేణి, పద్మజ, సరస్వతి, నిర్మల, రాణి, గిరిజ, బాలస్వామి, వినోభ, పూసా శ్రీనివాస్, పింటు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు లుకాస్, సత్తిరెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, బుక్కా సురేష్, సందీప్, భాస్కర్, వెంకట్ రెడ్డి, అలీం, రాములు, శంకర్, హరీష్ రెడ్డి, గౌతమ్ తదితరులు హాజరయ్యారు.






# గ్రామాల్లో పంచాయతీల నిర్వహణ మెరుగుపడాలి

**–జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, జనవరి -06(తెలంగాణ ముచ్చట్లు)**

జిల్లాలో గ్రామ పంచాయతీ ల నిర్వహణ మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగవారం వేంసూరు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మండల పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో కలిసి మండల అధికారులతో సమీక్షించారు.

భూ భారతి రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం, సాదాబైనామా పెండింగ్ అప్లికేషన్లు, కుల ధృవీకరణ ప్రతాలు, మీ సేవా సర్టిఫికేట్ లు, మండల విద్యాలయాలు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఇజిఎస్ పనులు, రుణాల మంజూరు, యూరియా పంపిణీ, ప్రాథమిక వైద్యశాలలో మహిళ సాధారణ ప్రసవాల పెంపు, ఆర్&బీ రోడ్ల మరమ్మత్తులు, రోడ్ భద్రతా ప్రమాణాలు, లేబర్ బడ్జెట్ ప్రతిపాదన పై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులతో పాటు కార్యదర్శి పాత్ర అత్యంత కీలకమని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు. పంచాయతీ నిర్వహణ మెరుగుపడాలని, ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ జరిగేలాగా పర్యవేక్షించాలని, గ్రామాల నిర్వహణ పనులకు ట్యాక్స్ లను సకాలంలో వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెండవ దశ ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలులో పదాలు చదివే సామర్థ్యం ఉన్న పిల్లలు వ్యాఖ్యలు చదివేలా, అక్షరాలను చదివే పిల్లలు పదాలు చదివేలా సామర్థ్య పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేసే విధంగా మండల విద్య అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి రోజు ఒక గంట సమయం రీడింగ్ కోసం కేటాయించాలని, ఆంగ్ల భాష ఫోనెటిక్స్ బేసిక్ గా ఆ పదాన్ని ఆ శబ్దం ఎందుకు వస్తుందో ఫోనేటిక్స్ తో నేర్పించాలని తెలిపారు. మండలంలో యూరియా పంపిణీ కి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, యూరియా కోసం రైతులు ఏ సమయంలో రావాలో వారికి ముందస్తుగానే సమాచారం అందిస్తూ కూపన్లు కూడా జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎవరు ప్రస్తుత అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

హౌసింగ్ శాఖ మంత్రివర్యులు ఖమ్మం జిల్లా నుంచి ఉన్నారని, రాష్ట్రంలో ప్రథమంగా మన జిల్లా పరిధిలో అత్యధికంగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్దం చేయాలని అన్నారు. వేంసూరు మండలంలో 616 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వాటిలో ఇండ్లు స్లాబ్ పూర్తి చేసుకొని ఉన్నాయని, గ్రామీణ ప్రాంత అభివృద్ధి లో భాగంగా 237 ఇండ్లకు రుణాలు కల్పించినట్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గర్భినులకు సాధారణ ప్రసవాలు పెంచే విధంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల పలు శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వేంసూరు తహసీల్దారు జె. మానిక్ రాజ్, వివిధ శాఖల మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# విల్సన్‌కు 'టాటా'.. ఎయిరిండియా సీఈఓ కోసం కసరత్తు!

ఎయిరిండియాకు కొత్త సీఈవోను నియమించే దిశగా టాటా గ్రూప్ అన్వేషణ ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ పదవీ కాలం 2027 జూన్‌తో ముగియనున్ననేపథ్యంలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అలాగే తక్కువ ఖర్చుతో సేవలు అందించే అనుబంధ సంస్థ 'ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్' కొత్త ఎండీ నియామకంపైనా టాటా గ్రూప్ దృష్టి సారించినట్లు తెలిసింది.

"2027 తర్వాత ఒప్పందాన్ని పొడిగించాలనే ఉద్దేశం విల్సన్‌కూ, టాటా గ్రూప్‌కూ లేదు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సీఈవోగా చేయాలని టాటాసన్స్ భావిస్తోంది. అందులో భాగంగా ఎయిరిండియాకు బాధ్యతలు చేపట్టగలిగే సామర్థ్యం కలిగిన అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నారు" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787-8 ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక జూన్ నాటికి వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా, టాటా హౌస్‌లో సోమవారం జరిగిన ఓ అధికారిక సమావేశానికి క్యాంప్‌బెల్ విల్సన్ హాజరు కావడం గమనార్హం.

# పెరిగిన పీవీసీ ఆధార్ కార్డు ఛార్జీలు




ఆధార్ కార్డు దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడానికి.. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉంది. ఇందులో భాగంగానే.. పేపర్‌లెస్ ఆధార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్తగా ఆధార్ యాప్ కూడా ప్రవేశపెట్టింది. ఇపుడు తాజాగా.. ఆధార్ పీవీసీ కార్డు కోసం సర్వీస్ ఛార్జీని రూ.50 నుంచి రూ.75కి పెంచింది.

పెరిగిన పీవీసీ కార్డు సర్వీస్ ఛార్జీలలో.. ట్యాక్స్, డెలివరీ ఛార్జీలు ఉన్నాయి. 2020లో ఈ సేవ ప్రవేశపెట్టిన ధర పెంచడం ఇదే మొదటిసారి. 2026 జనవరి నుంచి ఆధార్ పీవీసీ పొందాలనుకుంటే వినియోగదారులు కొత్త ఛార్జీలు చెల్లించాల్సిందే. మై ఆధ్దార్ వెబ్‌సైట్ లేదా ఎం ఆధార్ మొబైల్ యాప్ అప్లై చేసుకొనే వినియోగదారులకు కూడా ఇవే ఛార్జీలు వర్తిస్తాయి. సంవత్సరం జనవరి 1 నుండి కొత్త ధర అమలులోకి వచ్చిందని యూఐడీఏఐ తెలిపింది. పీవీసీ ఆధార్ కార్డు ధరల పెరుగుదలకు కారణం.. నిర్వహణ ఖర్చులు పెరగడం అని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. కొన్నేళ్లుగా.. ఆధార్ పీవీసీ కార్డ్ ఉత్పత్తి, పంపిణీకి సంబంధించిన మెటీరియల్స్, ప్రింటింగ్, సురక్షిత డెలివరీ, లాజిస్టిక్స్ ఖర్చు పెరిగింది. దీనివల్ల ఛార్జీలు పెంచినట్లు సంస్థ స్పష్టం చేసింది.

# బంగారం బాటలో మరో మెటల్

బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్న సమయంలో.. ఇతర లోహాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే ప్లాటినం ధరలు కూడా దూసుకెళ్తున్నాయి, ఇదే వరుసలో రాగి రేటు కూడా అమాంతం పెరిగిపోయింది. ఇప్పుడు లిథియం కూడా ఇదే వరుసలోకి చేరింది.

బంగారం అనేది కేవలం ఒక లోహంగా మాత్రమే కాకుండా.. మన దేశంలో చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. ఇండియాలో గోల్డ్‌ను సెంటిమెంట్‌గా భావించేవారి ఎక్కువగా ఉందని చెప్పడంలో కూడా ఎటువంటి సందేహం లేదు. దీనిని కొందరు ఆస్తిగా కూడా పరిగణిస్తారు. ఈ కారణాల వల్లనే ఇందులో పెట్టుబడి పెట్టేవారి సంఖ్య ఎక్కువగా ఉంది.

ఇప్పుడు బంగారం, వెండి మాదిరిగానే.. లిథియంకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. దీనిని బ్యాటరీల తయారీలో, ఎలక్ట్రిక్ వెహికల్స్, మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. అంతే కాకుండా.. ఇంధన, క్లిన్ ఎనర్జీ వంటి రంగాల్లో కూడా దీని వినియోగం చాలా ఎక్కువైంది. కాబట్టి చాలామంది ఇందులో కూడా పెట్టుబడులు పెడుతున్నారు.

సాధారణ లేదా పాత బ్యాటరీలతో పోలిస్తే.. లిథియం అయాన్ బ్యాటరీలు చాలా మన్నికైనవి. ఛార్జింగ్ కూడా వేగంగా ఉంటుంది. కాబట్టి దీనిని ఎలక్ట్రిక్ వాహనాల తయారీలు ఎక్కువగా వినియోగిస్తారు. రాబోయే రోజుల్లో ఈవీల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. లిథియం డిమాండ్ మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ లిథియం నిల్వలు కలిగిన దేశాల జాబితాలో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. ఆ తరువాత స్థానంలో చిలీ, అర్జెంటీనా, బొలీవియా, చైనా ఉన్నాయి. ఈ దేశాలతో పోలిస్తే.. భారతదేశంలో లిథియం నిల్వలు కొంత తక్కువే. అయితే మనదేశంలో లిథియం నిల్వలు ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో జమ్మూ & కాశ్మీర్, కర్ణాటక, రాజస్థాన్ మొదలైనవి ఉన్నాయి. కాబట్టి.. భవిష్యత్తులో లిథియంను ఇండియా దిగుమతి చేసుకుపోవాల్సిన అవసరం వచ్చే అవకాశం లేకపోలేదు.







# క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, జనవరి -06(తెలంగాణ ముచ్చట్లు)**

పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 15వ బెటాలియన్ బి. గంగారం ప్రాంగణంలో మంగళవారం రోజున ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ -2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా వేడుకలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై, పోలీస్ సిబ్బంది కంటింజెంట్ కవాతును పరిశీలించి స్పోర్ట్స్ మీట్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కలిసి క్రీడాకారులను కలెక్టర్ పరిచయం చేసుకొని, 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలను మన జిల్లాలో ప్రోత్సహించడం సంతోషంగా ఉందని తెలిపారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో సమన్వయం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, స్ఫూర్తి, పోటీతత్వం, సమన్వయ బావం మరింత బలపడుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది నిర్వహించిన కవాతు అత్యంత ఆకర్షణీయంగా ఉందని, వారి క్రమశిక్షణ, సమయపాలన అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినా, క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే నిజమైన విజయం అని ఆయన స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది విధి బాధ్యతలతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపుతూ ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమని, ఇలాంటి క్రీడా పోటీలు సిబ్బందిని మరింత సమర్థవంతమైన ప్రజాసేవకు ప్రేరేపిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడల ద్వారా జీవితంలో ముఖ్యమైన పాఠాలు నేర్చుకోవచ్చని, స్వీయ నియంత్రణ, టీం స్పిరిట్, ఓటమి నుంచి కోలుకొని విజయం వైపు కొనసాగడం వంటి అనేక మంచి గుణాలు నేర్పిస్తుందని అన్నారు. ప్రతి రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, కమాండెంట్ ఎన్. పెదబాబు, అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. శ్రీధర్ రాజా, బి. వేణుగోపాల్ రెడ్డి, ఏవో వి. అశోక్ కుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్ట్రియల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# 15వ బెటాలియన్‌లో క్రీడా సందడి.!

- **బి గంగారంలో ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్–2026.**
- **ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.**

**సత్తుపల్లి, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

15వ బెటాలియన్ బి గంగారం ప్రాంగణంలో మంగళవారం ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్-2026ను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలకు చెందిన పోలీస్ సిబ్బంది కంటింజెంట్ కవాతు నిర్వహించారు. కవాతు క్రమశిక్షణతో సాగి ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధుల్లో ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తగ్గించడంలో క్రీడా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల ద్వారా సిబ్బందిలో ఉత్సాహం, జట్టు స్ఫూర్తి పెరుగుతాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను క్రీడా స్ఫూర్తితో నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ వసుందర యాదవ్, కమాండెంట్ ఎన్. పెదబాబు, అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. శ్రీధర్ రాజా, బి. వేణుగోపాల్ రెడ్డి, ఏవో వి. అశోక్ కుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బడి బస్సు డ్రైవర్ల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- **ట్రస్మా సహకారంతో సత్తుపల్లి నియోజకవర్గంలో వైద్య పరీక్షల శిబిరం.**
- **సత్తుపల్లిలో డ్రైవర్లకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించిన రవాణా శాఖ.**

**సత్తుపల్లి, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**






జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు (జనవరి 1 నుంచి 31 వరకు)లో భాగంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) సహకారంతో మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రైవేట్ విద్యాసంస్థల బడి బస్సు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించగా సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూర్, కల్లూరు, ఏనుకూరు మండలాలకు చెందిన 147 మంది బస్సు డ్రైవర్లు, క్లీనర్లు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. పరీక్షల ద్వారా పలువురు డ్రైవర్లు తమకు బీపీ, షుగర్, కంటి సమస్యలు ఉన్నట్లు తొలిసారిగా తెలుసుకున్నారు.

స్థానిక ఎస్వీసీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సిరికొండ హర్షిత్ బీపీతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించగా, హీనా ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ నిర్వాహకుడు డాక్టర్ హీరాలాల్ కంటి పరీక్షలు చేసి అవసరమైన సూచనలు అందించారు. శ్రీ రాఘవేంద్ర రక్త పరీక్ష కేంద్రం నిర్వాహకుడు పాషా షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రవి




కుమార్ సహకారం అందించారు.

అతివేగం, అజాగ్రత్త, సెల్‌ఫోన్ వాడకం తగదు ఈ సందర్భంగా ఎంవీఐ శ్రీనివాసరావు, సహాయ మోటారు వాహన పరిశీలకుడు రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు కలిసి బడి బస్సులు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లు, క్లీనర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్యా సంస్థల సంఘు జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి, రమణ

# సత్యానగర్ బస్తీలో నీటి సమస్యకు పరిష్కారం

- **ఆకారపు అరుణ్ పటేల్ చొరవతో పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తు**

**ఉప్పల్, జనవరి 6 (తెలంగాణ ముచ్చట్లు):**





ఉప్పల్ నియోజకవర్గం వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్యానగర్ బస్తీలో గత నెల రోజులుగా కొనసాగుతున్న వాటర్ పైప్‌లైన్ లీకేజీ సమస్యకు పరిష్కారం లభించింది. నీటి వృధాతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ చొరవతో సమస్యను సత్వరమే పరిష్కరించారు. ఇటీవల నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమంలో స్థానికులు ఈ సమస్యను ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, తమ ప్రియ తమ నాయకుడు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అధికారుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి పైప్‌లైన్ లీకేజీని సరిచేశారు. అదేవిధంగా మంగళవారం నవరాంగూడ ప్రాంతంలో ఆకారపు అరుణ్ పటేల్ పర్యటించి స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ప్రాంతంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రతి సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని ఆకారపు అరుణ్ పటేల్ తెలిపారు.



# చలికాలంలో పెరుగు తింటున్నారా?



శీతాకాలంలో విటమిన్లు అధికంగా ఉండే పెరుగును తినడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. పెరుగు చల్లదనాన్ని కలిగి ఉంటుందని, ఇది జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని భయపడుతుంటారు. కానీ, ఆయుర్వేదంలో సీజన్‌తో పనిలేకుండా పెరుగు ఆరోగ్యానికి మంచిది. కానీ, చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. ఇది జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. శీతాకాలంలో పెరుగు తినాలా..? వద్దా అనే సందేహం చాలా మంది వ్యక్తం చేస్తుంటారు. ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగును తీసుకోవడం మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. కానీ, శీతాకాలంలో విటమిన్లు అధికంగా ఉండే పెరుగును తినడానికి చాలా మంది వెనుకాడుతుంటారు. పెరుగు చల్లదనాన్ని కలిగి ఉంటుందని, ఇది జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని భయపడుతుంటారు. కానీ, ఆయుర్వేదంలో సీజన్‌తో పనిలేకుండా పెరుగు ఆరోగ్యానికి మంచిది. కానీ, చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. ఇది జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. పెరుగును సాధారణ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే తినాలని గుర్తుంచుకోండి. ఇది కాకుండా, మీరు ఉదయం పెరుగు తినాలి. ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు మీ పేగులలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచడంలో చాలా సహాయపడుతుంది. పెరుగులో ఉండే కాల్షియం మీ ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పెరుగు ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లేవిన్, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంది. ఈ పోషకాలు రోజువారీ శరీర విధులకు సహాయపడతాయి. జీవక్రియను మెరుగుపరుస్తాయి. మొత్తం ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. పెరుగు పోషక విలువలు మెరుగైన రోగనిరోధక శక్తికి, జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగుల సమతుల్యతను కాపాడటం ద్వారా, శరీర సహజ రక్షణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం ద్వారా అనేక సాధారణ సమస్యలను తగ్గించవచ్చు. చలికాలంలో పోషకాహార నిపుణులు పెరుగును పగటిపూట తినమని చెబుతున్నారు. ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల శరీరం దానిని సులభంగా జీర్ణం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. చల్లబరిచే, పోషక లక్షణాలను పూర్తిగా ఉపయోగించుకోవచ్చు. పెరుగు సహజంగానే శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి కాబట్టి.. రాత్రిపూట పెరుగు తినడం జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. చలి సంబంధిత సమస్యలను మరింత పెంచుతుంది. ఇది శీతాకాలంలో రాత్రి సమయంలో తీసుకోవడానికి తక్కువ అనుకూలంగా ఉంటుంది. చలికాలంలో రాత్రిపూట పెరుగు తింటే కొంతమందిలో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. చల్లదనం కారణంగా చలి, దగ్గు, గొంతు నొప్పి లేదా సైనస్ సమస్యలు వంటి లక్షణాలు తీవ్రమవుతాయి. పెరుగులో కాల్షియం, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని కాపాడటానికి అవసరమైన రెండు ముఖ్యమైన ఖనిజాలు. రోజూ పగటిపూట తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పెరుగు తక్కువగా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని సరిగ్గా తినడం ద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. కాలక్రమేణా ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి దోహదపడుతుంది. పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. మృత కణాలను తొలగిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొడిబారడం, మందగించటానికి పేరుగాంచిన శీతాకాలంలో స్పష్టమైన, ఆరోగ్యకరమైన చర్మం కనిపించడానికి సహాయపడుతుంది.

# నవ్వితే పోయేదేం లేదు.. అనారోగ్యం తప్ప..!

నేటి ఒత్తిడితో కూడిన జీవితంలో, నవ్వు అనేది ఒక చౌకైన, ప్రభావవంతమైన ఔషధం. ఇది మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరుస్తుంది, ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. నవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది, శరీరంలో ఆక్సిజన్ స్థాయిలను పెంచుతుంది మరియు సంబంధాలను బలపరుస్తుంది. ప్రతిరోజూ బిగ్గరగా నవ్వడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. నేటి ఉరుకుల పరుగుల జీవితాల్లో ప్రజలు ఒత్తిడి, ఉద్రిక్తతను తమ నిత్య సహచరులుగా చేసుకున్నారు. కొన్నిసార్లు వారు దాని నుండి బయటపడటానికి ఖరీదైన చికిత్సలు, మందులను కూడా ఆశ్రయిస్తారు. కానీ, ఈ సమస్యకు చౌకైన, అత్యంత ప్రభావవంతమైన చికిత్స బిగ్గరగా నవ్వడం అని మీకు తెలుసా? నవ్వు మీ మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరచడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఒక నివేదిక ప్రకారం, నవ్వు కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. రోగనిరోధక కణాలను పెంచుతుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. వ్యాధుల నుండి రక్షిస్తుంది. మనం నవ్వినప్పుడు, మన హృదయ స్పందన రేటు కొద్దిసేపు పెరుగుతుంది. తరువాత కండరాల సడలింపు, రక్తపోటు తగ్గుతుంది. ఇది శరీరమంతా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఫలితంగా, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బిగ్గరగా నవ్విన తర్వాత, డయాఫ్రాగమ్, ఊపిరితిత్తులు చురుగ్గా మారుతాయి. ఇది ఆక్సిజన్ స్థాయిలను పెంచుతుంది. ఊపిరితిత్తులలో చిక్కుకున్న గాలిని బయటకు పంపుతుంది. బిగ్గరగా నవ్వడం వల్ల శరీరంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుందని, శ్వాస తీసుకోవడం సులభతరం అవుతుంది. నవ్వు ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. డోపమైన్, సెరోటోనిన్ వంటి ఆనందాన్ని కలిగించే న్యూరోకెమికల్స్‌ను పెంచుతుంది. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుం. మనకు మంచి అనుభూతిని కలిగిస్తుంది. మనం మన భాగస్వాములతో, స్నేహితులతో, సహోద్యోగులతో లేదా కుటుంబ సభ్యులతో నవ్వుతున్నా, నవ్వు సంబంధాలలో సాన్నిహిత్యాన్ని, నమ్మకాన్ని పెంపొందిస్తుంది. నవ్వు ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. విభేదాలను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇతరులను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.



# పడుకునే ముందు స్నానం మంచిదా!

కొంతమందికి రోజుకు రెండుసార్లు స్నానం చేసే అలవాటు ఉంటుంది, ముఖ్యంగా వేసవిలో. అయితే, చలికాలంలో రాత్రి పడుకునే ముందు స్నానం చేయాలా వద్దా అనే విషయంలో చాలా మందికి అయోమయం ఉంటుంది. వాస్తవానికి, నిద్రవేళకు ముందు స్నానం చేయడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. డాక్టర్ల అభిప్రాయం ప్రకారం, రాత్రి పడుకునే ముందు స్నానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, రోజంతా పేరుకుపోయిన అలసట దూరమవుతుంది. తలస్నానం చేసేటప్పుడు, చాలా వేడి నీటిని ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలి. వేడి నీరు శరీర ఉష్ణోగ్రతను పెంచి, మరింత వేడిగా అనిపించేలా చేస్తుంది. కాబట్టి, గోరువెచ్చని నీటితో స్నానం చేయడానికి ప్రయత్నించడం ఉత్తమం. నిద్రవేళకు 1 నుండి 2 గంటల ముందు స్నానం చేయడం వల్ల పగటి అలసట తగ్గుతుంది. మీ శరీరం రిలాక్సడ్ స్థితిలోకి వెళుతుంది. రాత్రి స్నానం చేయడం వల్ల పగటిపూట పేరుకుపోయిన క్రిములు మరియు ఇన్ఫెక్షన్లు తొలగిపోతాయి, తద్వారా అనారోగ్య ప్రమాదం తగ్గుతుంది. ఈ రోజుల్లో, బిజీ జీవనశైలి కారణంగా చాలా మందికి తగినంత నిద్ర ఉండటం లేదు. సరైన నిద్ర లేకపోవడం అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. హెల్త్‌లైన్ ప్రకారం, పడుకునే ముందు స్నానం చేయడం వల్ల శరీరం చల్లబడి, మెరుగైన నిద్రకు సహాయపడుతుంది. ఇది శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి చాలా మంచిది. పడుకునే ముందు స్నానం చేయడం వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి మీ మానసిక స్థితి మెరుగుపడటం. రోజంతా పని, ఒత్తిడి తర్వాత, పడుకునే కొన్ని గంటల ముందు స్నానం చేయడం వల్ల చిరాకు తగ్గి, ప్రశాంతత లభిస్తుంది. రోజంతా మీ చర్మంపై చెమట, ధూళి పేరుకుపోవడం వల్ల మొటిమలు, మచ్చలు వస్తాయి. రాత్రి స్నానం చేయడం వల్ల మీ చర్మం శుభ్రపడి, చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా ఉంచడానికి తోడ్పడుతుంది.



# రక్తపోటును తొలగించే డ్రింక్..?


మహిళల్లో చాలా మందికి రక్తహీనత సమస్య ఉంటుంది. రక్తహీనత వల్ల పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా రక్త హీనతతో బాధపడేవారిలో తీవ్రమైన బలహీనతను కూడా ఉంటుంది. మహిళల్లో చాలా మందికి రక్తహీనత సమస్య ఉంటుంది. రక్తహీనత వల్ల పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా రక్త హీనతతో బాధపడేవారిలో తీవ్రమైన బలహీనతను కూడా ఉంటుంది.అలాంటి సందర్భాల్లో వైద్యులను సంప్రదించి రక్తం వృద్ధికి మందులు తీసుకోవల్సి ఉంటుంది. మీకూ రక్తహీనత ఉంటే వైద్యులు సూచించిన మందులతోపాటు ఆహారంలోనూ పలు మార్పులు చేర్చుకోవాల్సి ఉంటుంది. అవేంటంటే. రక్త పరిమాణాన్ని పెంచడంలో బీట్‌రూట్ దుంపలు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. రక్త పరిమాణాన్ని పెంచడానికి బీట్‌రూట్ కంటే ప్రయోజనకరమైనది మరొకటి లేదు. రక్తం వృద్ధికి మీ ఆహారంలో వివిధ పద్ధతుల్లో దుంపలను చేర్చుకోవడం మంచిది. బీట్‌రూట్‌తో కూడా వివిధ వంటకాలు తయారు చేసుకోవచ్చు. బీట్‌రూట్‌తో పాటు, పాలకూర కూడా రక్త పరిమాణాన్ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పాలకూరను ఆహారంలో వివిధ మార్గాల్లో తీసుకోవడం ద్వారా రక్త పరిమాణాన్ని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూరను రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల తక్కువ రక్తపోటు సమస్యను శాశ్వతంగా తొలగిస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి




ఉదయం ఖాళీ కడుపుతో బీట్‌రూట్, పాలకూర జ్యూస్ తాగడం మంచిది.

# ఈ లక్షణాలను లైట్ తీసుకోవద్దు

స్థూలకాయులలో కొవ్వు కాలేయ (ఫ్యాటీ లివర్) సమస్యలు సర్వసాధారణం.. కానీ ప్రజలు తరచుగా సన్నగా ఉన్నవారికి వాటితో బాధపడరని అనుకుంటారు.. అది తప్పు. ఈ రోజుల్లో, సన్నగా ఉన్నవారికి కూడా కొవ్వు కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో, అనారోగ్యకరమైన ఆహారాలు, చెడు ఆహారపు అలవాట్లు, పేలవమైన జీవనశైలి.. ఫ్యాటీ లివర్ సమస్యలకు దారితీస్తాయి.. అయితే.. ఊబకాయం, బొడ్డు కొవ్వు ఉన్న వారికి ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా ఉంటుందని పేర్కొంటారు.. కానీ అలా కాదు.. సన్నగా బక్కగా ఉన్నవారు కూడా ఇప్పుడు ఫ్యాటీ లివర్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఫ్యాటీ లివర్ (కొవ్వు కాలేయం) అనేది అధిక కొవ్వు పేరుకుపోవడం ద్వారా వర్గీకరించబడిన ఒక పరిస్థితి. కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోయినప్పుడు, అది లివర్ సిర్రోసిస్‌కు దారితీస్తుంది. ఫిట్‌నెస్ పట్ల స్పృహ ఉన్న యువకులు ఫ్యాటీ లివర్ సమస్యలను ఎదుర్కొంటున్నారని.. దీని విషయంలో జాగ్రత్త తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. సన్నగా బక్కగా కనిపించే యువత కూడా ఫ్యాటీ లివర్ బారిన పడవచ్చు. బరువు పెరగడం, ఎక్కువసేపు కూర్చోవడం, ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుందని నమ్ముతారు. ఈ రోజుల్లో, సన్నగా ఉన్నవారు కూడా ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. బయటి నుండి ఫిట్‌గా కనిపించే వ్యక్తులు జీవక్రియపరంగా ఆరోగ్యంగా ఉండకపోవచ్చు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, సన్నగా కనిపించే, వ్యాయామం చేసే కొంతమందిలో విసెరల్ ఫ్యాట్ ఉండవచ్చు. ఈ రకమైన కొవ్వు చర్మం కింద కాకుండా శరీర అంతర్గత అవయవాలను చుట్టుముడుతుంది. ఈ దాచిన కొవ్వు శరీరంలో చాలా చురుకుగా ఉంటుంది. ఫిట్‌నెస్ లోపం ఉన్న వ్యక్తులలో విసెరల్ ఫ్యాట్ ఫ్యాటీ లివర్ సమస్యలకు దారితీస్తుంది. సన్నగా ఉన్నవారిలో ఫ్యాటీ లివర్ నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతుంది. దీని లక్షణాలు చాలా సాధారణం. ఫ్యాటీ లివర్ అలసట, పక్కటెముకల కింద తేలికపాటి నొప్పి, బరువు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ఈ సంకేతాలను తరచుగా నిర్లక్ష్యం చేస్తారు. సన్నగా ఉన్నవారు తరచుగా రోగ నిర్ధారణ ఆలస్యంగా ఎదుర్కొంటారు. కాలేయ ఆరోగ్యాన్ని బాహ్య బరువు ద్వారా నిర్ణయించకూడదు. యోగా లేదా జిమ్‌ను క్రమం తప్పకుండా సాధన చేసే వ్యక్తులు లోపల ఏమి జరుగుతుందో గమనించాలి. కొవ్వు కాలేయం అనేది అధిక బరువు ఉన్నవారికి మాత్రమే వచ్చే వ్యాధి కాదు.. ఇది జీవనశైలి, జన్యుశాస్త్రం, అంతర్గత జీవక్రియ నమూనాల ద్వారా నిర్ణయించబడిన సమస్య అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.





# న్యూస్ పేపర్లలో బజ్జీ, వడలు తినడం ప్రమాదకరమా!

ఇండియాలో ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో టీ బడ్డీలు, రోడ్డు పక్కన ఉన్న చిరు హోటళ్లలో సాయంత్రం స్నాక్స్ తినడం సాధారణం. బజ్జీలు, వడలు, బోండాలు ఎన్నెన్నో రుచులతో ఆకర్షిస్తాయి. ఇండియాలో ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో టీ బడ్డీలు, రోడ్డు పక్కన ఉన్న చిరు హోటళ్లలో సాయంత్రం స్నాక్స్ తినడం సాధారణం. బజ్జీలు, వడలు, బోండాలు ఎన్నెన్నో రుచులతో ఆకర్షిస్తాయి. చాలా మంది ఈ వేడి వేడి పదార్థాలను పాత వార్తాపత్రికల్లో ఇస్తుంటారు. వాటిలోనే పార్శిల్ చేస్తారు. తక్కువ ఖర్చు, ఈజీగా పని పూర్తవుతుందని అనిపించినా, ఇందులో దాగి ఉన్న ఆరోగ్య ప్రమాదాలు చాలా తీవ్రమైనవి. వార్తాపత్రికల ప్రింటింగ్ ఇంక్, లెడ్ వంటి భారీ లోహాలు, రసాయనాలు, పిగ్మెంట్లు, బైండర్లు, యాడిటివ్లు ఉంటాయి. ఇవి ఆహారంలో కలిసినప్పుడు ముఖ్యంగా వేడి వేడిగా ఉన్న బజ్జీలు, వడలు వంటి పదార్థాల్లోకి ఇంక్ కలిసిపోతుంది. ఈ రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి క్రమంగా పేరుకుపోయి, జీర్ణక్రియ సమస్యలు, టాక్సిసిటీ, కాలేయం, మూత్రపిండాల దెబ్బ, నాడీ వ్యవస్థ రుగ్మతలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి ప్రమాదాలు కలిగిస్తాయి. వీటి తయారీకి వాడే కొని పదార్థాలు



క్యాన్సర్ కారకాలు (కార్సినోజెనిక్) కూడా. ముఖ్యంగా పిల్లలు, యువకులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు తొందరగా ఇబ్బందిపడతారు. భారత ఆహార భద్రతా ప్రామాణిక అథారిటీ 2018లోనే వార్తాపత్రికలను ఆహార ప్యాకేజింగ్ కోసం ఉపయోగించడం నిషేధించింది. అయినా చాలా చోట్ల ఈ పద్ధతి కొనసాగుతోంది. వార్తాపత్రికల్లో ఆహార పదార్థాల ప్యాకింగ్ నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలి. రూల్స్ ఉల్లంఘించిన వారికి అధిక జరిమానాలు విధించేలా ఆదేశాలు జారీ చేయాలి. నూనె పీల్చుకునేందుకు ఫుడ్ గ్రేడ్ అబ్సార్బెంట్ పేపర్ లేదా టిష్యూ పేపర్ ఉపయోగించండి. పార్శిల్ కోసం అల్యూమినియం ఫాయిల్, బ్రౌన్ పేపర్ బ్యాగులు లేదా బయోడిగ్రేడబుల్ ప్యాకెట్లు వాడండి. వార్తాపత్రికలో ప్యాక్ చేసిన లేదా వడ్డించిన ఫుడ్‌ను తీసుకోవడానికి నో చెప్పండి. మీ బాక్స్ తీసుకెళ్లి పార్శిల్ చేయించుకోండి. ఇంట్లో కూడా వండిన పదార్థాలను వార్తాపత్రికల్లో పెట్టి తినడాన్ని నిషేధించండి. ఆహారాన్ని ప్లేట్లలో వడ్డించండి లేదా అరటి ఆకులు, మంచి క్లాత్ వంటి సహజమైన వాటిని ఉపయోగించండి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పర్యావరణానికి కూడా మంచివి. ఈ చిన్న అలవాట్లు మార్చుకోవడం వల్ల మనం మాత్రమే కాకుండా మన ఫ్యామిలీ, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. రుచికరమైన బజ్జీలు, వడలు తినాలనిపిస్తే ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సురక్షితమైన ప్రాంతాల్లో, శుభ్రమైన పాత్రల్లో తినండి. ఆరోగ్యమే మహాభాగ్యం.. దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తుంచుకోండి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 'ది రాజాసాబ్' నుంచి రెండు సీన్లు కట్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన తొలి హారర్ కామెడీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. విలన్ పాత్రలో సంజయ్‌దత్ కనిపించబోతున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

ఫ్యాన్స్ కోసం ఒకరోజు ముందే..అనగా జనవరి 8న సాయంత్రమే ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఇటీవల ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ రన్ టైమ్ బయటకు వచ్చింది. ఈ సినిమా రన్‌టైమ్ 189 నిమిషాలు. అంటే 3 గంటల 9 నిమిషాల నిడివితో ప్రేక్షకులను అలరించబోతుంది.

ఇక ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చిన సెన్సార్ సభ్యులు.. సినిమా మొత్తంలో రెండు కట్స్ మాత్రమే చెప్పారట. సినిమాలో తల నరికే సీన్‌తో పాటు నేలపై ఎక్కువ రక్తం కనిపించే సన్నివేశాన్ని తొలగించాలని సూచించారు. దీంతో ఆ రెండు సీన్స్ సినిమాలో నుంచి తొలగించిన 189 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారట.

బాహుబలి తర్వాత పాన్ ఇండియా సినిమాలన్నీ దాదాపు మూడు గంటల నిడివితోనే రిలీజ్ అవుతున్నాయి. బాహుబలి తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన చిత్రాలన్నీ దాదాపు ఎక్కువ రన్‌టైమ్‌నే కలిగి ఉన్నాయి. ఇప్పుడు ది రాజాసాబ్‌కూడా అత్యధిక నిడివితో విడుదల కాబోతుంది. హారర్ కామెడీతో ప్రేక్షకులను మూడు గంటలు కూర్చోబెట్టడం కాస్త రిస్కే. ఏమాత్రం తేడా వచ్చిన ఫలితం తారుమారు అవుతుంది. 'రాజాసాబ్' మాత్రం రిస్క్ చేసి మరీ పెద్ద నిడివితో వస్తున్నాడు. ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.





# పారిస్‌లో అరుదైన ఘనత సాధించిన 'వారణాసి' గ్లింప్స్

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న 'వారణాసి' సినిమా అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను పారిస్‌లోని ప్రఖ్యాత లే గ్రాండ్ రెక్స్ థియేటర్లో ప్రదర్శించారు. ఇలా అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఈ విషయాన్ని లే గ్రాండ్ రెక్స్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించగా.. దాన్ని 'వారణాసి' టీమ్ రీట్వీట్ చేస్తూ సంతోషం వ్యక్తం చేసింది. దీన్ని గొప్పగా ఆదరించిన పారిస్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. తమ సాహసయాత్ర వారణాసి నుంచి పారిస్ వరకు చేరుకుందని.. 2027లో పూర్తి మహాకావ్యంతో మళ్లీ థియేటర్లలో కలుద్దామని చిత్ర బృందం ట్వీట్‌లో పేర్కొంది. గతంలో ఈ థియేటర్లో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాల్ని ప్రదర్శించారు. అయితే ఓ భారతీయ చిత్ర గ్లింప్స్‌ను ఈ స్థాయిలో ఓ వేడుకగా విడుదల చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక మరోవైపు ఈ చిత్ర విడుదల తేదీపైనా నెట్టింట ఆసక్తికర ప్రచారం సాగుతోంది. దీన్ని వచ్చే ఏడాది శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 9న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్ర వర్గాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రపంచాన్ని.. కాలాన్ని చుట్టేసే సాహసికుడి కథతో రూపొందుతున్న ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ సినిమాలో మహేశ్‌బాబు రుద్ర అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే రామాయణ ఘట్టానికి సంబంధించిన సీక్వెన్స్‌లో రాముడిగా కనువిందు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇక దీంట్లో మందాకినిగా ప్రియాంక చోప్రా కనిపించనుండగా.. కుంభ అనే ప్రతినాయక పాత్రను పృథ్వీరాజ్ సుకుమారన్ పోషిస్తున్నారు. దీనికి ఎం.ఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. కె.ఎల్ నారాయణ, ఎస్.ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు.

# వాయుకాలుష్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

వాయుకాలుష్యంలోనూ దేశరాజధానిగా పనికిరాని పేరు తెచ్చుకుని గ్యాస్‌ఛాంబర్‌గా తయారైన ఢిల్లీని కాలుష్యం బారి నుంచి తప్పించడడంలో కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) విభాగం ఘోరంగా విఫలమవుతోందని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఢిల్లీని చుట్టేస్తున్న వాయుకాలుష్యానికి ప్రధాన హేతువులను గుర్తించి, పరిష్కారాలను సూచిస్తూ రెండు వారాల్లోగా తగు నివేదికను సమర్పించాలని సీఏక్యూఎంకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం మంగళవారం సూచించింది.






పొరుగురాష్ట్రాల గుండా ఢిల్లీలోకి వచ్చే వాహనాలు గంటలతరబడి వేచి ఉండటంతో సరిహద్దుల వెంబడి ఉన్న ప్రధాన టోల్‌ప్లాజాలు కాలుష్యకేంద్రాలుగా తయారయ్యాయని, వెంటనే వాటిని వేరే ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది. దీంతో వాటిని తాత్కాలికంగా మూసేయడం లేదంటే వేరే చోటుకు మార్చడంపై తుది నిర్ణయం తీసుకునేందుకు రెండు నెలల సమయం కావాలని సీఏక్యూఎం కోరడంతో ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. రెండు నెలల గడువు ఇవ్వడం కుదరదు. కేవలం రెండు వారాల సమయం ఇస్తున్నాం. ఈలోపు నివేదిక ఇవ్వండి''అని ధర్మాసనం ఆదేశించింది.

''పరిష్కారం చూపండయ్యా అంటే అది వదిలేసి ఆయా టోల్‌ప్లాజాలే మాకు ఆదాయ వనరులు అంటూ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అఫిడవిట్ సమర్పించింది. వీళ్లను చూసి గురుగ్రామ్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ సైతం ఇదే పాట పాడుతోంది. గురుగ్రామ్‌లో పర్యావరణ నష్టపరిహార రుసుముల్లో సగభాగం తమకు ఇప్పించాలని కోరుతోంది. ఇదేం వైఖరి?. దీర్ఘకాలిక పరిష్కారాలతో లేదా నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలతో ముందుకు రావాల్సిన సంస్థలు ఇలా సమస్య తీవ్రత తెలీకుండా వ్యవహరిస్తున్నాయి. గతంలో మేం లేవనెత్తిన అంశాలపై వివరణ ఇవ్వకుండా మౌనం దాల్చడం కూడా ఏమాత్రం సబబుగా లేదు''అని కోర్టు వ్యాఖ్యానించింది.

''ఢిల్లీలో కాలుష్యం తగ్గాలంటే కార్ల సంఖ్యను కుదించాలి. కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ కార్లు ఉన్నాయి. కుటుంబానికి లేదా ఒక వ్యక్తికి ఒక్కటే కారు అనే నిబంధన అమలుచేస్తే వాహన కాలు ష్యం కాస్తం తగ్గొచ్చు''అని సీనియర్ న్యా యవాది రాకేశ్ ద్వివేది వాదించారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ''ఇప్పుడు జనాల్లో కారు అనేది స్టేటస్ సింబల్‌గా తయారైంది. జనం సైకిళ్లు ఉపయోగించడం మానేశారు. సరిపడా డబ్బులు కూడబెట్టి నేరుగా కారు కొనేస్తున్నారు''అని అన్నారు. ఆటోమొబైల్ పరిశ్రమ అత్యంత శక్తివంతంగా తయారైందని లాయర్ వ్యాఖ్యానించారు. దీనిపై సీజేఐ స్పందించారు. ''ధనవంతులు ఒక రకమైన త్యాగం చేస్తే బాగుంటుంది. అత్యంత ఖరీదైన కార్లు కొనేబదులు విద్యుత్‌తో నడిచే కార్లు కొంటే ఉత్తమం''అని అన్నారు.

# యూపీలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి.. 2.89 కోట్ల ఓట్లు తొలగింపు

ఉత్తరప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే కసరత్తు కొలిక్కి వచ్చింది. రివిజన్ అనంతరం ఏకంగా 2.89 కోట్ల ఓట్లు తొలగింపుకు గురయ్యాయి. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నవ్‌దీప్ రిన్వా మంగళవారం ఈ మేరకు వెల్లడించారు. వీరిలో ఏకంగా 2.57 కోట్ల మంది శాశ్వత వలస వెళ్లిపోయినట్టు తెలిపారు. మరణాలు, బహుళ నమోదుల వంటి కారణంగా మిగతా ఓట్లను తొలగించినట్టు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల సంఖ్యను 12.55 కోట్లుగా ముసాయిదా ఎన్నికల జాబితా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు యూపీలో ఓటర్ల సంఖ్య 15.44 కోట్లుగా ఉండేది. తుది ఓటర్ల జాబితాను మార్చి 6న ప్రచురిస్తామని రిన్వా ప్రకటించారు. ముసాయిదా జాబితాపై యూపీలో విపక్షాలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. ఈసీ అసలు రివిజన్ కసరత్తుకు సరిపడా సమయమే ఇవ్వలేదని యూపీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ ఆరోపించారు.





# కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసిన మండల నాయకులు

**ధర్మసాగర్,జనవరి06(తెలంగాణ ముచ్చట్లు):** మండలానికి చెందిని పలువురు బిజెపి నాయకులు మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే రాజకీయ పరిణామాలపై పరస్పరంగా చర్చించినట్లు సమాచారం స్థానిక స్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమైన అంశాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాల్సిన అవసరంపై నాయకులు అభిప్రాయాలు వెల్లడించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించాలనే అంశంపై చర్చ జరిగింది.ఈ భేటీలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సాయం సందీప్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజా శ్యామ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మాచర్ల అనిరుద్‌తో పాటు తాటికాయల గ్రామ శాఖ అధ్యక్షులు పెసరు వెంకటేష్ పాల్గొన్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in